అందరికీ అందుబాటులో ఉంటా

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- పలుగ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ పరిశీలన

వడ్డేపల్లి మండలం కొంకలలోద రఖాస్తులనుస్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

వడ్డేపల్లి, జనవరి 2: అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలకు సంబంధించిన కార్యక్రమంలో మంగళవారం కొంకల, తనగల గ్రామాల్లో ఎమ్మెల్యే పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. గ్రామంలో ఎన్ని రేషన్ కార్డులు అవసరం ఎంతమందికి ఇండ్లు అవసరం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు. కొంకల గ్రామం లో 960, కొత్త రేషన్ కార్డుల కోసం 236, తనగలలో 920, కొత్త రేషన్ కార్డుల కోసం 320 దరఖాస్తులు స్వీకరించామని ఎంపీడీవో రవీంద్ర తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ముషాయిదా బేగం, సర్పంచ్ బతుకన్న, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ గౌడు, మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు గోపాల, మండల ప్రత్యేకాధికారి ముషాయిదాబేగం, ఎంపీడీవో రవీంద్ర, నాయకులు శ్రీనివాసులు గౌడ్, మాణిక్యారెడ్డి, శేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు సిబ్బంది పాల్గొన్నారు.

మానవపాడు మండలంలో...

మానవపాడు, జనవరి 2: మండల పరిధిలోని బోరవెల్లి, జల్లాపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాల వద్ద దరఖాస్తులు అందించేందుకు ప్రజలు ఉదయం నుంచే తరలివచ్చారు. ఈ కేంద్రాలను ఎమ్మెల్యే విజయుడు సందర్శించారు. తప్పులు లేకుండా దరఖాస్తులను సరిచూడాలని, సిబ్బందితో సరి చేయించాలని ఎంపీడీవోకు సూచించారు. మండల ప్రత్యేకాధికారి నాగేంద్రం ప్రజాపాలన కేంద్రాలను తనిఖీ చేశారు. బోరవెల్లిలో 1,085 దరఖాస్తులు, జల్లాపురంలో 982 దరఖాస్తులు అందాయని ఎంపీడీవో తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల, జనవరి 2 : జిల్లాలోని ఉద్యోగస్తుల సౌకర్యార్థం వారికి మెరుగైన సేవలు అందించడానికి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఏటీఎం ఉపయోగపడుతుందని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. కలెక్టరేట్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఏటీఎంను రీజినల్ డైరెక్టర్ నిఖిలతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ సముదాయంలో ఉన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి ఇది ఉపయోగంగా ఉంటుందన్నారు. ఇక్కడ ఏటీఎం ఏర్పాటు చేయడంతో ఉద్యోగస్తులు, సిబ్బందికి సమయం ఆదా ఆవుతుందన్నారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసులు, రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, ఎల్‌డీఎం అయ్యపురెడ్డి, బ్రాంచ్ మేనేజర్లు ఆర్‌జీయాదవ్, రమాస్మృతి, ఏవో భద్రప్ప పాల్గొన్నారు.

ఎక్కడిస మస్యలనుఅక్కడే ప రిష్కరించాలి

- కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

వనపర్తి, జనవరి 2 : ప్రజాపాలన కార్యక్రమంలో సంక్షేమ పథకాల దరఖాస్తులతో పాటు ఇతర సమస్యల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు తీసుకొని పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మంగళవారం ఎంపీపీ కిచ్చారెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొని అభయ హస్తం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను గ్రామ స్థాయిలో గుర్తించి అక్కడే పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు. అభయ హస్తం దరఖాస్తులతోపాటు ప్రజల వ్యక్తిగత సమస్యలు, కానీ గ్రామ సమస్యలుంటే ఓ తెల్ల కాగితం పై రాసి ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అందించాలన్నారు. అభయ హస్తం దరఖాస్తులు ఎలా పూరించాలో గ్రామంలో చదువుకున్న యువకులు ఫారాలు నింపడంలో సహకరించాలని కోరారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ జిరాక్స్ పొందుపర్చి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ జిల్లా అధికారి సుధీర్‌రెడ్డి, ఎంపీడీవో సుదర్శన్, సర్పంచ్ బాగ్యలక్ష్మి, ఎంపీటీసీ శశిరేఖ, ఉపసర్పంచ్ అబ్దుల్లా, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ : ముగ్గురికి గాయాలు

అమరచింత, జనవరి 2 : రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలైన ఘటన మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులో మంగళవారం ఉదయం చోటుచేసుకున్నది. గ్రామస్తులు కథనం ప్రకారం పాంరెడ్డిపల్లికి చెందిన కుర్వ మల్లేశ్ తన తల్లి ఆలివేలమ్మతో కలిసి బైక్‌పై అమరచింత నుంచి సొంత గ్రామానికి వెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన మరో యువకుడు బైక్‌పై అమరచింతకు వస్తుండగా విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఎదురెదురుగా బైక్‌లు ఢీ కొనడంతో ముగ్గురికి బలమైన గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లు నుజ్జు నుజ్జు అయ్యాయి. గమనించిన బాటచారులు 108కు సమాచారం అందించి క్షతగాత్రులను మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించారు. ఈ విషయంపై అమరచింత పోలీసులను సంప్రదించగా 100డయల్ ద్వారా ప్రమాద సమాచారం అందిందని, జిల్లా దవాఖానకు వెళ్లి విచారణ చేస్తామని బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

32 క్వింటాళ్ల ధాన్యం అపహరణ

చిన్నంబావి, జనవరి 2 : గుర్తు తెలియని వ్యక్తులు వరిధాన్యం దొంగిలించిన ఘటన మంగళవారం మండలంలోని పెద్దదగడ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై కృష్ణ ఓబుల్‌రెడ్డి కథనం ప్రకారం మండలంలోని పెద్దదగడ గ్రామానికి చెందిన జింకల యాదయ్య తన పొలంలో పండించిన వరిధాన్యాన్ని తూకం వేసి 46 సంచుల్లో ఉంచి మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే విగ్రహం పక్క ఉన్న ఓ వెంచర్‌లో ఉంచాడు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వరిధాన్యాన్ని దొంగిలించినట్లు తెలిపారు. దొంగిలించిన ధాన్యం 46సంచుల్లో 32 క్వింటాళ్లు ఉంటాయని, రూ.లక్ష నష్టం ఉండవచ్చని చెప్పారు. బాధితుడు యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై చెప్పారు.

సీఎంఆర్ బియ్యం విషయంపై ఆరా

- రహస్యంగా విచారణ చేపట్టిన పోలీసులు

గద్వాల అర్బన్, జనవరి 2 : కొన్ని రోజులుగా సీఎంఆర్ వడ్లు, బియ్యం సరఫరాలో మిల్లు నిర్వాహకులు అవకతవకలు పాల్పడిన విషయం జిల్లాలో ఆరోపణలు వినబడుతున్న విషయం విధితమే. ప్రభుత్వం ఐకేపీ సెంటర్లను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేసి మిల్లు నిర్వాహకులు అప్పగిస్తే ఇదే అదునుగా భావించిన కొంత మంది రైస్ మిల్లు నిర్వాహకులు సివిల్ సప్లై అధి కారుల అండదండలతో పెద్దమొత్తంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వినబడుతున్నాయి. పత్రికల్లో ప్రభుత్వ వడ్లు, బియ్యం స్వాహా అంటూ వివిధ ప్రతికలలో కథనాలు వెల్లువడ్డాయి. ఈ విషయంపై మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా అధికారుల సమీక్షలో ప్రభుత్వ వడ్లు, బియ్యంపై ఆరా తీశారు. మంత్రి అడిగిన ప్రశ్నలకు సివిల్ సప్లై అధికారులతో సరైన సమాధానం రాకపోవడంతో సీఎంఆర్ వడ్లపై పూర్తి నివేదిక కావాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రైతుల నుంచి వడ్లను సేకరించి మిల్లు నిర్వాహకులకు అందజేస్తే వారు ఎంత అందచేశారో నేటికి పూర్తి స్థాయిలో లెక్కలు తేలాడం లేదు. అయితే ఈ విషయంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీఎంఆర్ వడ్లు, బియ్యంపై సమగ్ర నివేదికను ఇవ్వాలని పోలీసులను అదేశించారు. పోలీస్ అధికారులు ఈ విషయంపై రహస్యంగా విచారణ చేపట్టి కీలక సమాచారం సేకరించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఒక మిల్లు నిర్వాహకుడిపై విచారణ చేయగా వడ్లు తీసుకొని ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యాన్ని అందించలేదన్న విషయాలను పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఈ వ్యక్తి పలు మిల్లులను లీజుకు తీసుకొని నడిపిస్తున్నట్లు సమాచారం. మిల్లు నిర్వాహకులు అవకతవకలలో ముఖ్య భూమిక పోషించింది సివిల్ సప్లై అధికారులే అన్ని గుసగుసలు వినబడుతున్నాయి. అవకతవకలలో విషయంలో సివిల్ సప్లై అధికారుల పాత్రపై కూడా రహస్యంగా విచారణ చేపట్టినట్లు సమాచారం.

అక్రమాలకు పాల్పడితే వదలబోం

వడ్లు, బియ్యం అవకతవక విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎవరినీ వదిలే ప్రసక్తి లేదని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ కేసు విషయంలో కీలక అధారాలను సేకరించామని, అక్రమాలకు పాల్పడిన వారిని త్వరలో పట్టుకుంటామన్నారు. జిల్లాలో సీఎంఆర్ వడ్లు ఎన్ని మిల్లు తీసుకున్నాయో.. ఎంతమంది వడ్లకు సంబంధించి రికార్డులను నమోదు చేశారో.. ఎంత మంది వడ్లు తీసుకొని బియ్యం ఇవ్వకుండా ఉన్నారో రైస్‌మిల్లుల నిర్వాహకుల వివరాలు సేకరించామని, త్వరలోనే ఈకేసు కొలిక్కి వస్తుందన్నారు.

ప్రతి దరఖాస్తునూ క్షుణ్ణంగా పరిశీలించాలి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి

గొర్లఖాన్‌దొడ్డి గ్రామసభలోద రఖాస్తునుప రిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గట్టు, జనవరి 2 : ప్రజాపాలన గ్రామసభల్లో స్వీకరించే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు సలహా, సూచనలు చేశారు. దరఖాస్తులను స్వీకరణను వేగంగా చేయాలన్నారు. దీనివల్ల పెండింగ్‌కు అవకాశం ఉండదన్నారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అవి అసమగ్రంగా ఉంటే సంబంధిత దరఖాస్తుదారుల నుంచి సమాచారం సేకరించి పూర్తి చేయాలన్నారు. ప్రతి దరఖాస్తుకు విధిగా రసీదు ఇవ్వాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ప్రజాపాలన గ్రామసభల మండల ప్రత్యేకాధికారి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తాసీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి

ధరూర్, జనవరి 2 : కార్యకర్తలను బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే సతీమణి, బూరెడ్డిపల్లి సర్పంచ్ బండ్ల జ్యోతి అన్నారు. మండలంలోని భీంపురం గ్రామానికి బీఆర్ఎస్ కార్యకర్త మేస్త్రీ హనుమంతు మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆమె గ్రామానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఆమె వెంట వైస్ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ మహాబూబ్, నాయకులు కురుమన్న, ధర్మనాయుడు, చిన్నారెడ్డి, భరత్‌రెడ్డి, చంటి పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

అయిజ, జనవరి 2 : ఐపీఎల్ (అయిజ ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నీలో పాల్గొంటున్న క్రీడాకారులకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మధుకుమార్ దుస్తులు అందజేశారు. మంగళవారం పట్టణంలోని తిక్కవీరేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో క్రికెట్ క్రీడాకారులకు టీఎఫ్ఐ టీంకు డ్రెస్సులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు శివ, నాగరాజు, వెంకటేశ్, హరి కృష్ణ, చిన్న, మహేశ్, రాజు, మౌల, ఉదయ్, రాము, అక్షయ్, దేవ, అజయ్, దినకర్, రమేశ్, వెంకటేశ్, వీరేశ్, చంటి, మహేందర్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

గద్వాల టౌన్, జనవరి 2 : జిల్లా కేంద్రంలోని భీంనగర్‌లో కొలువుదీరిన సంస్థానాదీశుల ఇలవేల్పు, భక్తుల కొంగు బంగారం అయిన సంతానవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారిని పల్లకీపై ఊరేగించారు. ప్రారంభ పూజల్లో రాజవంశీయులు, ఆలయ ధర్మకర్తలు డాక్టర్ సుహాసినిరెడ్డి, డాక్టర్ విక్రసింహారెడ్డి పాల్గొన్నారు. రాత్రి 7గంటలకు సంతాన వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామల కల్యాణోత్సవం ఆలయ వంశపార్యంపర్య అర్చకులు బోరవెల్లి రాఘవచారి, పవనాచారి వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి ముఖ్య అతిథులుగా సంస్థానాదీశుల వంశస్థులైన డాక్టర్ సుహాసినిరెడ్డి, విక్రసింహారెడ్డి, సంయుక్తమ్మ పట్టుబట్టలు సమర్పించారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

వనపర్తి టౌన్, జనవరి 2: జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రక్షితామూర్తి ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సిబ్బందితో కలిసి ఆమె కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

రూ.లక్షా48వేలు లూటీ

వనపర్తి టౌన్, జనవరి 2 : పార్ట్ టైం జాబ్ అంటూ వాట్సాప్‌లో మెస్సెజ్ చేసి రూ.లక్షా 48వేలు లూటీతో చేసిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పట్టణ ఎస్సై యుగంధర్‌రెడ్డి కథనం ప్రకారం జిల్లాకేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన మాలిక్‌కు డిసెంబర్ 31న వాట్సాప్‌కు పార్ట్‌టైం జాబ్ ఉందని మెస్సెజ్ వచ్చింది. హెచ్ఆర్ టీం టెక్నాలజీలో జాబ్ ఉందని సోషల్ మీడియాలో సెలబ్రిటీల పేరు ఫాలోఅప్ చేస్తే రూ.1200 ఇస్తామని చెప్పి అకౌంట్‌లో జమచేశారు. అలాగే ఈనెల 1న టాస్క్ అని చెప్పి మళ్లీ రూ.2వేలు కమిషన్ వేశారు, మరో టాస్క్ చేస్తే మరింత కమీషన్ వస్తుందని నమ్మబలికారు. ఇలా పూర్తి చేసిన టాస్క్‌లకు రూ.3900 కమీషన్ వచ్చింది. మరి పెద్ద టాస్క్ చేస్తే మరింత ఆదాయం వస్తుందని తెలుపగా మొత్తం రూ.లక్షా48వేలు అకౌంట్‌లో వేశాడు. ఎంతకు వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో మోసపోయామని బాధితుడు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ఎస్సై చెప్పారు.

ప్రజాసమస్యలపై అధికారులు దృష్టిపెట్టాలి

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, జనవరి 2 : ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కనిమెట్ట గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు ప్రజాపాలనలో సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ముమ్మళ్ళపల్లి గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని జెడ్పీవైస్ చైర్మన్, ఎంపీపీ, సీడీసీ చైర్మన్ చెన్నకేశవ రెడ్డిలు ప్రారంభించారు.కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంతమౌనిక, మాజీ జెడ్పీటీసీ పీజే బాబు, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రశాంత్, రావుల యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

మదనాపురం, జనవరి 2 : అర్హులందరూ ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తుల చేసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొన్నూరు గ్రామంలో ప్రజాపరిపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీవో నాగేంద్రం, సీఐ రత్నం, ఎస్సై మురళి, సర్పంచ్ జగన్, ఎంపీటీసీ శరత్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగన్న, ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు నారాయణరెడ్డి, మురళిధర్‌రెడ్డి, మెగారెడ్డి, హనుమాన్‌రావు, మహదేవన్‌గౌడ్, రాఘవేంద్ర, జగదీశ్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికే..

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ఖిల్లాఘణపురం, జనవరి 2: పేదల అభ్యున్నతికే ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందుతాయన్నారు. గణప సముద్రం ముంపు రైతులకు గతంలో చెప్పినదానికంటే మెరుగైన పరిహారం అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా సీఎం సహాయనిధి , కల్యాణలక్ష్మి చెక్కులను వనపర్తి క్యాంపు కార్యాలయంలో కాకుండా అర్హులైన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచు వెంకటరమణ, తాసీల్దార్ పాండునాయక్, ఎంపీడీవో విజయ్‌కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పులుల సంచారం

- కెమెరాలు ఏర్పాటు చేసిన ఫారెస్ట్ అధికారులు

ఖిల్లాఘణపురం, జనవరి 2: మండలంలోని మల్కిమియాన్‌పల్లి గ్రామంలో నల్లగట్టు సమీపంలో కొద్ది రోజుల నుంచి రెండు చిరుత పులులు సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. సోమవారం రాత్రి రైతులు పోలానికి వెళ్లి పనులు చేస్తుండగా నల్లగట్టుపై తిరుగుతున్న పులిని బ్యాటరీ లైట్ వేసి సెల్‌ఫోన్‌లతో వీడియో తీశారు. ఆ వీడియో వైరల్ కావడంతో స్పందించిన ఫారెస్ట్ అధికారులు మంగళవారం పులి సంచరిస్తున్న ప్రదేశాల్లో సీసీ కెమెరాలను బిగించారు. ఈ కెమెరాల ద్వారా పులి కదలికను గుర్తించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ డిప్యూటీ రెంజర్ భాస్కరాచారి తెలిపారు. ప్రజలు ఎవరూ ఒంటరిగా తిరుగకూడదని, పొలాల వద్దకు వెళ్లినప్పుడు ఇద్దరు లేదా ముగ్గురు కలిసి వెళ్లాలని ఆయన గ్రామస్తులకు సూచించారు.

18లోగా అప్‌లోడ్ చేయాలి

గద్వాలటౌన్, జనవరి 2 : ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే ఈడీఎల్ఈపీసీ జిల్లా సైన్స్ ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులు ఈనెల 18వ తేదీ వరకు ప్రదర్శనను అప్‌లోడ్ చేయాలని డీఈవో సిరాజుద్దీన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్పైర్ అవార్డులు, మనక్ స్కీంకు జిల్లా నుంచి 65మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులు నిర్వహించే ప్రదర్శన నిర్వహణ నిమిత్తం రూ.10వేల వారి అకౌంట్లలో జమచేసినట్లు తెలిపారు. ప్రదర్శన పూర్తి వివరాల కోసం 950267200 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అంబేద్కర్ జీవితంపై నేడు నాటక ప్రదర్శన

వనపర్తి, జనవరి 2 : జిల్లా కేంద్రంలోని సురవరం సాహితీ కళాభవన్‌లో బుధవారం సాయంత్రం 5:30 గంటలకు సంగం శరణం గచ్చామి నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి మంగళవారం ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ కార్యక్రమమా.. పార్టీ కార్యక్రమమా?

గద్వాల రూరల్, జనవరి 2 : ప్రజాపాలన గ్రామ సభలో ప్రజాప్రతినిధులు కాకుండా పార్టీ కార్యకర్తలు వేదికపైకి పిలవడంతో గ్రామ సర్పంచ్ కుర్వ వాసు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇది ప్రభుత్వ కార్యక్రమమా లేక పార్టీ కార్యక్రమమా అని ఆగ్రహం వ్యక్తం చేశాడు. మండలంలోని మంగళవారం సంగాల, జిల్లెడిబండ, కాకులారం, కుర్వపల్లి తదితర గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ హాజరై దరఖాస్తులు స్వీకరించారు. కుర్వపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కానివారిని వేదికపై పిలువడంతో సర్పంచ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధులు కానివారిని వేదికపై నుంచి పంపించాలని నిరసన వ్యక్తం చేశారు. కానీ జెడ్పీ చైర్ పర్సన్ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఎంపీడీవోను ఆదేశించడంతో ఆయన ప్రారంభించారు. దీంతో గ్రామసభ సర్పంచ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

చిన్నంబావి, జనవరి 2: ప్రజాపాలనలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ తిరుపతిరావు అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని లక్ష్మీపల్లి, కొప్పునూరు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తాసీల్దార్ ఇక్బాల్, ఎంపీడీవో రవినారాయణ, డీటీ శ్రీనివాస్, జెడ్పీటీసీ వెంకట్రామమ్మ, పాల్గొన్నారు.

వీపనగండ్ల, జనవరి 2 : మండలంలోని తూంకుంటలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ తిరుపతిరావు తనిఖీ చేసి దరఖాస్తుల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కతలప్ప, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

దరఖాస్తులు స్వీకరించిన ఆరోగ్య కార్యకర్త

ధరూరు, జనవరి 2 : ధరూరులో నిర్వహించిన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరణకు ఆశ కార్యకర్తను నియమించారు. సిబ్బంది కొరత ఉంటే వేరే శాఖల సిబ్బందిని వినియోగించుకోవాలని ఆశా కార్యకర్తను వినియోగించుకోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన
తేది : 29-12-2023
ఇందుమూలముగా నమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా! నా క్లయింట్ శ్రీ యస్.లక్ష్మిరెడ్డి తండ్రి యస్.వీరారెడ్డి, నివాసము : కల్లూరు గ్రామము మరియు మండలము కర్నూలు జిల్లా, ప్రస్తుత నివాసము : కర్నూలు పట్టణము అయిన నాక్లయింట్ సలహా మరియు సూచనమేరకు జారీచేయు ప్రకటన ఏమనగా! నాక్లయింట్ భూమి సర్వేనెం.430/ఎ, విస్తీర్ణము ఎ.0-16గుంటలు, తిమ్మాపురం గ్రామ పంచాయితి ఎర్రవల్లి మండలము (గతములో ఇటిక్యాల మండలము), జోగుళాంబ గద్వాల జిల్లా గల భూమికి పట్టాదారుగా మరియు అనుభవదారుగా సంపూర్ణ యాజమాన్య హక్కులతో అనుభవించుచున్నాడు. కాగా, ఇటిక్యాల మండలము, కొండపేట గ్రామస్తులైన 1) నడిమింటి మన్యంకొండ తండ్రి కీ.శే. నడిమింటి భీనన్న, 2) నడిమింటి నర్సింహా తండ్రి కీ.శే. నడిమింటి భీనన్న 3) నడిమింటి చిన్న వెంకన్న తండ్రి కీ.శే. నడిమింటి భీనన్న మరియు 4) నాయికి మూలింటి రామిరెడ్డి తండ్రి చిన్న బీచుపల్లి, నివాసము: యాక్రాపురం గ్రామము, ఇటిక్యాల మండలము అను వ్యక్తులు నాక్లయింటుకు సంబంధించిన పై తెలిపిన భూమికి పట్టాదారు పాసుబుక్కులు నాక్లయింటు పేరున జారీ చేయు విషయములో తహశీల్దారు ఇటిక్యాల మండలము వారి దగ్గర ఆక్షేపణలను తెలియజేయగా, నాక్లయింటు పైతెలిపిన నలుగురు వ్యక్తులపై మహారాజశ్రి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, గద్వాల యందు తనను సంపూర్ణ యజమానిగా తీర్మానించుచు పైవ్యక్తులకు వ్యతిరేకముగా కోర్టుతీర్పు ఇవ్వవలసిందిగా కేసు. O.S.NO. 20/2020 కేసును వేయటం జరిగినది. అట్టి దావా పైతెలిపిన వ్యక్తులపై విచారణ జరుగుచున్నది. అయితే, ఇటీవల నాక్లయింటు దృష్టికి వచ్చినది ఏమనగా, పైతెలిపిన నలుగురు వ్యక్తులు కేసు విచారణలో ఉన్న భూమి సర్వేనెం.430/ఎ ఎ.0-16గుంటలు భూమికి తామే యజమానులుగా చెప్పుకొనుచూ అట్టి భూమిని ఇతరులకు అమ్ముటకు ప్రయత్నించుచున్నారని అందుకు సంబంధించిన ఏర్పాట్లను సైతము ముమ్మరముగా చేయుచున్నారని తెలిసినది. సదరు భూమికి సంబంధించిన భూయాజమాన్య తీర్మానము ఇంకా కోర్టు యందు తీర్మానింపబడలేదు. కావున, సదరు విషయమై ఒకవైపు కోర్టులో విచారణ జరుగుచుండగా అట్టి విషయాన్ని దాచిపెడుతూ ఇతరులతో ఆర్థిక లావాదేవీలు అనగా రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజులు, అగ్రిమెంట్లు, దానపత్రములు మొదలగు వాటి రూపములో సదరు భూమిని విక్రయించుటకు వీలులేదు. కావున, ఒకవేళ ఎవ్వరైనా సదరు భూమికి సంబంధించి ఆర్థిక లావాదేవీలు జరిపినచో అట్టి లావాదేవీలు ఏవీ కూడా చట్టప్రకారము చెల్లనేరవని మరియ